నేటి దినపత్రిక
సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం | 07 మార్చి 2025 | పేజీలు 8


200 మంది స్కూల్ పిల్లలతో
# ఓపెన్ హౌస్ ప్రారంభం

2లో




జగన్మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన
# హామీలన్నీ దాదాపు నెరవేర్చారు

మాజీ మంత్రి కాకాని



పొదలకూరు, మేజర్‌న్యూస్ :

జగన్మోహన్ రెడ్డి ప్రజలకి ఇచ్చిన హామీలు అన్నిటిని దాదాపు నెరవేర్చారని సర్వేపల్లి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అన్నారు. మండలంలోని తాటిపర్తి గ్రామంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు హరి మాతృమూర్తి రంగమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి హయాంలో నేతన్న నేస్తం పేరిట తమకు ప్రతి ఏటా 24 చేనేతలకు ఉచిత విద్యుత్ అంటూ మోసం చేయడంతో తమకు ఎలాంటి లబ్ధి కలగలేదని చంద్రబాబు బూటకపు వాగ్దానాలతో ప్రజలు మోసపోయామని గ్రహించి బాధపడుతున్నారు. చంద్రబాబు అనేక పథకాలు ఆశ చూపి అధికారంలోకి వచ్చాక, మొండిచేయి చూపించాడంటూ.. ప్రజలు తీవ్ర నిరాశ, నిస్పృహాలకు లోనవుతున్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని దాదాపుగా నెరవేర్చారని, చంద్రబాబు ప్రచారం మోత తప్ప, సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తూ.. ప్రజలకు వాతలు పెడుతున్నాడన్నారు. సోమిరెడ్డి అభివృద్ధిని విస్మరించి, అవినీతి, అక్రమ సంపాదన ధ్యేయంగా బతుకుతున్నాడన్నారు. సోమిరెడ్డిపై అనేకసార్లు వచ్చిన ఆరోపణల్లో భాగంగా.. 100 కోట్ల ఇసుక దోపిడీ వాస్తవమేనని

-మిగతా 2లో



48 పాఠశాలలను
# మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతాం

- రాజధాని నిర్మాణానికి రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నులు ఖర్చు చేయం
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ

నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని 48 పాఠశాలలను అన్ని రకాలుగా బలోపేతం చేసి రాష్ట్రంలోనే మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో నెల్లూరు సిటీ నియోజకవర్గంలోని విద్య, సంక్షేమ వార్డు కార్యదర్శులతో గురువారం మంత్రి నారాయణ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు చేసే విధులు, వారి సమస్యలను ఆలకించి మరింత మెరుగ్గా ప్రజలకు సేవలందించేందుకు సూచనలు అందించారు. అనంతరం మంత్రి నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు సిటీ నియోజకవర్గంలో 34 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, 13 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 48 పాఠశాలల్లోని 304 తరగతి గదుల్లో ఇంటరాక్టివ్ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి తరగతికి ఒక ప్రత్యేక టీచరు ఉండే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇంటరాక్టివ్ బోర్డుల ద్వారా విజువల్స్‌తో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించుటకు ఉపాధ్యాయులకు తగిన శిక్షణ నిస్తామన్నారు. అన్ని పాఠశాలల్లోని ఆట స్థలాలను ఆధునికరిస్తామని, అవసరమైన ఆట వస్తువులు, జిమ్ ఎక్విప్మెంట్ అందిస్తామన్నారు. అదేవిధంగా ప్రతి సచివాలయ విద్యా కార్యదర్శి తన పరిధిలోని పాఠశాలల్లో అవసరమైన వసతులు గురించి విచారించి, నివేదికలు ఇవ్వాలని సూచించారు. నియోజకవర్గంలోని పాఠశాలలను రాష్ట్రంలోనే మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాన్ని రాబోయే మూడేళ్లలో కచ్చితంగా పూర్తి చేస్తామన్నారు. అవసరమైన నిధులను పలు రకాల రుణాల ద్వారా సేకరిస్తామని, తిరిగి వాటిని రాజధాని భూమి విలువలతో తీర్చివేస్తామన్నారు. రాజధాని నిర్మాణాన్ని సెల్ఫ్ ఫైనాన్సుడ్ ప్రాజెక్టుగా గతంలోనే తీర్చిదిద్దామన్నారు. రాష్ట్ర ప్రజలు వివిధ రకాల పన్నుల ద్వారా చెల్లించే మొత్తాలను రాజధాని నిర్మాణానికి వినియోగించమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష నాయకులు రాజధాని ఏర్పాటుపై చర్చిస్తామనడం హాస్యాస్పదమన్నారు. సమావేశంలో కమిషనర్ సూర్యతేజ, అడిషనల్ కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, డీఈఓ బాలాజీరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రంపై
# రైతుల్లో అవగాహన కల్పించాలి

అధికారులపై ఆర్డీవో ఆగ్రహం



ఉదయగిరి, మేజర్‌న్యూస్ :

ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు రారని, ధాన్యం అమ్మరని.. తనకు కథలు చెప్పొద్దని ఆత్మకూరు ఆర్డీవో పావని సొసైటీ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులపై అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని గుడినరవ గ్రామ రైతుసేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై చట్టుపక్కల గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏ రైతు అయినా ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఫిర్యాదులు వస్తే

-మిగతా 2లో

పార్కులలో వసతులు కల్పించి..
# ప్రజలకు అందుబాటులోకి తేవాలి



వివరాలు 02లో

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో బల్లలు,ఆట వస్తువులు,జిమ్ పరికరాలు, పచ్చదనం తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. - నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :

# పార్కులలో వసతులు కల్పించి.. ప్రజలకు అందుబాటులోకి తేవాలి

### కమిషనర్ సూర్యతేజ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో బల్లలు, ఆట వస్తువులు, జిమ్ పరికరాలు, పచ్చదనం తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్యతేజ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ గురువారం 37వ డివిజన్ న్యూ మిలిటరీ కాలనీ, ఓల్డ్ మిలిటరీ కాలనీ, రామ్‌నగర్ సివిఎస్ ఎస్ రోడ్డు తదితర ప్రాంతాలలో పర్యటించారు. ముందుగా పసల పెంచలయ్య మున్సిపల్ పార్కు, సోంపల్లి మహేష్ మున్సిపల్ పార్కులను సందర్శించారు. పార్కులలో ఆట వస్తువులు, జిమ్ పరికరాలు ఏవైతే పాడైన వాటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయవలసినదిగా ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులకు సూచించారు. అలాగే నగరవ్యాప్తంగా అన్ని డివిజన్లలో ఉన్న పార్కుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నామని కమిషనర్ తెలియజేశారు. పార్కులలో లైటింగ్, సాయంత్రం పార్కు క్లోజ్ చేసిన తర్వాత వేళలలో పోలీసుల వారికి తెలియజేసి పెట్రోలింగ్ ఏర్పాటు చేయవలసిందిగా సూచించారు. డస్ట్ బిన్‌లు ఎక్కడైతే పాడై ఉన్నాయో వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, చిన్న రిపేర్లు అయితే వెంటనే చేయించమని చెప్పి ఇంజనీరింగ్ అధికారులు ఆదేశించారు. మురుగు కాలువలలో సిల్ట్ తీసిన వెంటనే రోడ్లపై ఉంచకుండా మురుగు తొలగించేలా చర్యలు చేపట్టాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. అదేవిధంగా రోడ్డుపై ఉన్న సీఅండ్‌డీ వేస్ట్ వెంటనే తొలగించాల్సిందిగా టౌన్ ప్లానింగ్ సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. భవన నిర్మాణంలో భాగంగా కాలువలలో కన్‌స్ట్రక్షన్ మెటీరియల్ వేసి నీట పారుదలకు అంతరాయం కలిగించే భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని టౌన్ ప్లానింగ్ సిబ్బందిని ఆదేశించారు. డ్రైను కాలువల్లో మురుగునీరు పారుదలకు ఇబ్బందిగా ఉన్న దగ్గర ఐరన్ మెష్ ఏర్పాటు చేయవలసిందిగా ఇంజనీరింగ్ వారిని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ భానుశ్రీ, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ రామ్‌మోహన్ రావు, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్ కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్లా, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 200 మంది స్కూల్ పిల్లలతో ఓపెన్ హౌస్ ప్రారంభం - పాల్గొన్న అడిషనల్ ఎస్పీ సౌజన్య



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం-2025 వారోత్సవాలలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ సౌజన్య ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు నేపథ్యంలో, మహిళా దినోత్సవం వారోత్సవాలలో జిల్లా పోలీసు కార్యాలయంలో 200 మంది స్కూల్ విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమంలో, జిల్లా పోలీసు కార్యాలయంలో ఉండే మెయిన్ గేట్ గార్డు నుండి ఎస్పీ చాంబర్, అడిషనల్ ఎస్పీ చాంబర్, అన్ని సెక్షన్స్, ఐటి కోర్ టీం, సైబర్ టీం, ఏఆర్ హెడ్‌క్వార్టర్, పోలీస్ కంట్రోల్ రూమ్‌లోని సీసీ కెమెరాల పనితీరు, కమ్యునికేషన్ సెట్, డయల్ 112, ఎల్‌హెచ్‌ఎంఎస్, డాగ్ స్క్వాడ్ బృందాల పనితీరు, అన్ని ఆయుధాలు ఉంచే గది తదితర అన్ని విభాగాల పరికరాల పని తీరు, పోలీసు శాఖకు సంబంధించిన పలు విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంచి లక్ష్యంతో ఉన్నత స్థాయికు ఎదిగి, ప్రజలకు సేవలందించాలన్నారు. ఓపెన్ హౌస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పోలీసులకి, ప్రజలకు మధ్య సత్సంబంధాలు నెలకొల్పడమే లక్ష్యమన్నారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పోలీసుల దైనందిన విధులపై ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదేవిధంగా మహిళా చట్టాలు, ఫోక్సో యాక్ట్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలు, సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవలసిన జాగ్రత్తలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్వీయ రక్షణ మెళకువలు, మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండేందుకు సూచనలు.. నూతన చట్టాలపై అవగాహన.. బాల్య వివాహాలు, పోలీస్ హెల్ప్ లైన్, డయల్ 100/112, ఉమెన్స్ సేఫ్టీ యాప్ గురించి మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ మునిరాజ, మహిళ పోలీస్ స్టేషన్ డీఎస్పీ చెంచు రామారావు, సీఐ సుబ్బారావు, ట్రాఫిక్ సీఐలు వెంకటరెడ్డి, రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన
# హామీలన్నీ దాదాపు నెరవేర్చారు

*(మొదటి పేజీ తరువాయి)*

బట్టబయలు అయిందన్నారు. సోమిరెడ్డి విరువూరు ఇసుక రీచ్‌లో కోట్లాది రూపాయలు ఇసుక కొల్లగొట్టాడని, సోమిరెడ్డి తన బండ్లను ఆపిన మైనింగ్ అధికారులపై కక్షగట్టి బదిలీ చేయించే ప్రయత్నాలలో ఉన్నాడన్నారు. సోమిరెడ్డి అభివృద్ధి పనులు చేపట్టకపోగా, గత ప్రభుత్వంలో మంజూరైన పనులకు కమీషన్లు దండుకుంటున్నాడన్నారు. సోమిరెడ్డి పొదలకూరు లేఔట్ యజమానుల దగ్గర మాముళ్లు దండుకొని తన కూతురికి హైదరాబాద్‌లో విల్లా కొనిచ్చిన మాట వాస్తవమా.. కాదా ! ప్రజలకు తెలియజేయాలన్నారు. సోమిరెడ్డి తాను లేఔట్ల దగ్గర డబ్బులు దండుకోకపోతే.. కాణిపాకం వినాయకుని దగ్గర ప్రమాణానికి సిద్ధపడాలని సవాల్ విసిరారు. సోమిరెడ్డి కాణిపాకంలో ప్రమాణం చేయడానికి ముందుకు రాకపోతే లేఔట్ల యజమానుల దగ్గర లంచాలు తీసుకున్నట్లు ఒప్పుకోవాలన్నారు. సోమిరెడ్డి లాంటి అవినీతిపరుడు శాసనసభ్యుడై దోపిడీకి పాల్పడుతూ.. సర్వేపల్లి ప్రజలను విస్మరిసూ.. అక్రమ సంపాదనే ధ్యేయంగా బతుకుతున్నాడన్నారు. సోమిరెడ్డి ఇరిగేషన్ పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసి, రైతులను అడ్డుపెట్టుకొని దోచుకున్నాడన్నారు. రైతాంగానికి ధాన్యం అమ్మకాలలో, ప్రభుత్వం ఆర్భాటాలు మాని, గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఎవరికీ ఏ సమస్య వచ్చినా.. పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రంపై
# రైతుల్లో అవగాహన కల్పించాలి



*(మొదటి పేజీ తరువాయి)*

చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోసారి తాను తనిఖీ వస్తానని, ఆ సమయంలో రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చినా.. ధాన్యం కొనుగోళ్లల్లో ప్రగతి కనిపించకపోయినా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సమీపంలో ఉన్న సచివాలయం, హెల్త్ విలేజ్ క్లినిక్లను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మోచీ కులస్తుల కుల ధృవీకరణ పత్రాల మంజూరు విషయంపై వారితో చర్చించారు. ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. తొలుత గన్నేపల్లి రెవెన్యూలో జరుగుతున్న భూముల రీ సర్వేను పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభద్ర, డీటీ జహీర్ ఖాన్, సొసైటీ పర్సన్ ఇన్చార్జి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ సీఈవో పోలయ్య, సర్వేయరు శ్రీకాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ అనుబంధ సంఘాలన్నీ సమన్వయంతో పని చేయాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్-2025 అమలపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌లో అమలు చేయాల్సిన కార్యక్రమాలను ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంలో వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ అధికారులు కీలక భూమిక పోషించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులకు అవగాహన కల్పించి వారి ద్వారా భూమి సారవంతానికి అవసరమయ్యే నవధాన్య విత్తనాలను ఉత్పత్తి చేసి రైతులకు సరఫరా చేసేలా తోడ్పాటు అందించాలని రైతు సాధికార సంస్థ సభ్యులు, మండల వ్యవసాయ అధికారులు, ఏపీఎంలకు సూచించారు. ఎంత మేర విత్తనాల అవసరమో ముందుగా నిర్ధారించుకుని ఆ మేరకు మాత్రమే ఉత్పత్తిని చేయాలని సూచించారు. నవధాన్య విత్తనాల ద్వారా కలిగే భూమి సారవంతం, అధిక దిగుబడి, ఆరోగ్యకర పంటల ఉత్పత్తి మొదలైన ప్రయోజనాలను అన్నదాతలకు వివరించాలని సూచించారు. అలాగే పెరటి తోటల పెంపకంపై ఆసక్తి గల మహిళలను గుర్తించి వారికి అవసరమైన విత్తనాలు, సాంకేతిక సహకారాన్ని అందించాలని పేర్కొన్నారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయానికి అవసరమయ్యే మట్టి పనులను ఉపాధి హామీ ద్వారా చేపట్టేందుకు వ్యవసాయ అధికారులు, ఏపీఎంలు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన పనులను గుర్తించి నివేదిక పంపితే వెంటనే మంజూరు ఉత్తర్వులు ఇస్తామని చెప్పారు. ఉద్యానవన పంటల పెంపకానికి సబ్సిడీతో మొక్కలు ఇస్తున్నామని, ఆసక్తిగల రైతులు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. మండల, స్థాయిలో ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ అమలుపై అవగాహన సదస్సులు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు, రైతులకు వివరించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే లాభాలను తెలిపే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులు వరలక్ష్మి, కళావతి, సుబ్బమ్మ, రామ్మోహన్, వెంగల్ రెడ్డి ని జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మాలకొండయ్య, జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఏపీఎంఐపి పిడి శ్రీనివాసులు, డిఆర్డిఏ, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయాలపై

# శాసనమండలిలో నిలదీసిన చంద్రశేఖర్ రెడ్డి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** బడ్జెట్‌లో ఉద్యోగులకు,పేద ప్రజలకు ఎలాంటి భరోసా దక్కలేదని ఏపీ శాసనమండలిలో కూటమి ప్రభుత్వంపై ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి నిప్పులు చేరిగారు. గురువారం ఏపీ శాసనమండలి సమావేశాల్లో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు ఎన్నికల సమయంలో పెద్ద ఎత్తున కూటమి నేతలు హామీలు గుప్పించారని అయితే బడ్జెట్‌లో ఉద్యోగులకు ఎలాంటి నిధుల కేటాయింపులు జరపకుండా వారిని ప్రభుత్వం నిలువునా దగా చేసిందన్నారు. ఉద్యోగులకు ఇస్తామన్న ఐఆర్డీఏ అమలు చేయడంలో జాప్యం ఎందుకని పిఆర్సి అమలు చేసేందుకు కమిటీ వేస్తామని చెప్పి ఇప్పటివరకు కమిటీ వేస్తున్నట్లు ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయకపోవడం ఉద్యోగులను మోసం చేయడమేనాన్నారు. కోవిడ్ లాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా వైసీపీ ప్రభుత్వం ఐఆర్, పిఆర్సి అమలుచేసి ఉద్యోగులకు అండగా నిలిచిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం బడ్జెట్ లెక్కల్లో ఉద్యోగులకు సంబంధించిన చెల్లింపుల్లో 8 కోట్ల రూపాయలను తగ్గించి చూపించారని ఇది ఎలా సాధ్యమని ఉద్యోగులు కూడా దీనిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. డిఎ, పిఆర్సి బకాయిలు, పిఎఫ్, ఏపీజీఎల్ఐ బకాయిలను క్లియర్ చేస్తామని ఎక్కడ బడ్జెట్ కేటాయింపుల లెక్కల్లో ఉద్యోగులకు ఎక్కడ హామీ దక్కలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బడ్జెట్లో మార్పులు చేసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు దిశగా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే 2004 సెప్టెంబర్ ఒకటికి ముందు ఏపీలో 11 వేల మంది ఉద్యోగుల నియామకం జరిగిందని వారందరికీ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ పెన్షన్స్ స్కీమ్ అమలు చేయాలని స్పీకర్ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు. 90శాతం ప్రక్రియ పూర్తయిన 7వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని కోరారు. రెగ్యులరైజ్ చేసినప్పటికీ ప్రభుత్వం మీద ఎలాంటి ఆర్థిక భారం పడదని గత ప్రభుత్వంలో వారి వేతనాలను కూడా వైయస్ జగన్మోహన్ రెడ్డి గణనీయంగా పెంచారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాంట్రాక్ట్ ఉద్యోగులను పట్టించుకోని వారిని రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలకు సంబంధించి ఆరు క్వార్టర్స్ బకాయిలు చెల్లించాల్సి ఉందని.. వాటిని తక్షణమే చెల్లించి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కూటమి ప్రభుత్వ చర్యలు మూలంగా వాలంటీర్లు అందరూ రోడ్డున పడ్డారని.. వారందరికీ నిరుద్యోగ భృతి అందించడం.. లేదా వారికి ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆడబిడ్డ నిధి ఇస్తామని అటు మహిళలను కూడా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆసరా చేయూత పథకాలతో మహిళలను ఆర్థికంగా ఆదుకున్నారని గుర్తు చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఆడబిడ్డ నిధి పథకాన్ని అమలు చేసి మహిళలను ఆదుకోవాలని కోరారు. 2023-24 ఏడాదిలో వైఎస్ఆర్సిపి ప్రభుత్వం అన్ని పథకాలను అమలు చేసి కూడా కేవలం 73వేల కోట్ల రూపాయలు మాత్రమే అప్పులు చేస్తే 2024-25 సంవత్సరంలో కూటమి ప్రభుత్వం ఎలాంటి పథకాలు అమలు చేయకుండా 98 వేల కోట్ల రూపాయల అప్పులు చేసిందని ఆరోపించారు.అలాగే 2025-26 కు 1 లక్ష 4 వేల కోట్ల రూపాయల అప్పును బడ్జెట్లో చూపడం జరిగిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## కొత్తూరు సబ్ స్టేషన్ అంతరాయం




**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పోలీసు కాలనీలో కొత్త 11కేవీ లైన్ ఎరాక్షన్ కారణంగా నెల్లూరు రూరల్ పరిధిలోని కావేరి నగర్ సెక్షన్ ఏఈ కే.కుమార్ మాట్లాడుతూ.. శుక్రవారం, శనివారం 33/11కేవీ కొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని, కావేరి నగర్, రోశయ్య నగర్, బాబా గార్డెన్, అంజనీ లేఅవుట్‌లో ఉదయం 9:00 నుండి సాయంత్రం 2:00 గంటల వరకు పవర్ సప్లయ్‌కీ అంతరాయం కలుగును కావున కరెంట్ వినియోగదారులు మాకు సహకరించాలని తెలియజేశారు.

సహకార సంఘాలను..

# మరింత పటిష్టం చేయాలి

▸ జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని వ్యవసాయ, పాడి, మత్స్య సహకార సంఘాలను పటిష్టపరిచి సభ్యులకు మరింత మెరుగైన సేవలందించాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కోరారు. గురువారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. సహకార రంగం ద్వారా ఇప్పటివరకు సాధించిన అభివృద్ధిని జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ విజన్ డాక్యుమెంట్లో సూచించిన విధంగా 'సహకారం ద్వారా సమృద్ధి' స్ఫూర్తిగా సహకార సంఘాలను బలోపేతం చేయాలన్నారు. కంప్యూటరీకరించిన వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో మాన్యవల్ విధానంలో లావాదేవీలు నిర్వహించరాదని కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పిఎసిఎస్ సంఘాలు కవర్ చేయని గ్రామపంచాయతీల్లో నూతనంగా బహుళ ప్రయోజన పిఏసిఎస్ సంఘాలు, పాడి, మత్స్య సహకార సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే అర్హత కలిగిన అన్ని పిఏసిఎస్ లలో పెట్రోల్ బంకులు ఎల్పిజి గ్యాస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లా లోని ఏరియా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రధానమంత్రి జన ఔషధీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సహకార సంస్థలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో ఎలా సహాయపడతాయో తెలియజేసే విధంగా రూపొందించిన అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఇతర అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిసిసి బ్యాంకు సీఈవో శ్రీనివాసరావు, నాబార్డ్ డీడీఎం డాక్టర్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మకూరులో 66కోట్ల బృహత్తర తాగునీటిపథకం



▸ అందరికీ అందడం గగనం
▸ సీరియస్ అయిన మంత్రి ఆనం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులో ఒక బృహత్తర తాగునీటిపథకం అత్యధికంగా నిధులు వెచ్చించి 2013లో శంఖుస్థాపన గావించి 2018లో ప్రారంభించగా ఈనాటికీ పట్టణంలో అందరికీ ప్రతిరోజూ నిరిచ్చే పరిస్థితి లేకపోవడంతో ఇటవల అధికారులతో సమీక్ష జరిపిన రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీరియస్ అయ్యారు. దాంతో ఇటీవల కొంతమెరుగైంది. దాంతోపాటు అదనంగా 9కోట్ల రూపాయలు మంజూరు చేయించనున్నారు. ఆత్మకూరులో జనాభా అధికంగా ఉంటూ ఐదురోజులకొకదపా తాగునీరు పొందే పరిస్థితి ఉండగా 2012లో అప్పటి ఆత్మకూరు శాసనసభ్యులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ& ఆర్థికశాఖామాత్యులుగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి పరిస్థితిని గమనించి ఆత్మకూరుకు 40కిలోమీటర్లలో ఉన్న పెన్నానదిపైన ఉండే సోమశిల ప్రాజెక్టు నుండి ఆత్మకూరుకు తాగునీటిని అందించే బృహత్తర తాగునీటిపథకాన్ని (వాటర్ ట్రీట్‌మెంట్‌ప్లాంట్) 66కోట్ల రూపాయలతో మంజూరుచేయించి 2013లో శంఖుస్థానగావించగా నిర్మాణం పూర్తయ్యాక 2018లో మున్సిపల్‌శాఖా మంత్రి పొంగూరు నారాయణ ప్రారంభించారు. ఆత్మకూరులో పెద్ద వాటర్‌ప్లాంటు ఏర్పాటు చేశారు. సోమశిల ప్రాజెక్టు ఉత్తరకాలువనుండి పెద్దపైపులు ఏర్పాటు ద్వారా ఈప్లాంటుకు నీరుచేరేలా, ఇక్కడ నీటిని శుద్ధిచేసి ఈపథకంలో నిర్మించిన 10ఓవర్‌హెడ్‌ట్యాంకులను నీటిని అందిస్తే అక్కడనుండి కొళాయిలద్వారా ప్రజలకు సరఫరాచేసలా నిర్ణయించారు. రోజుకు 50లక్షల లీటర్ల నీరు ఆత్మకూరు ప్లాంటుకు చేరుతుండగా అక్కడ ఆలం, క్లోరిన్, ఫిల్టర్‌బెడ్‌లతో శుద్ధిచేసి నీటిని ప్రజలకు సరఫరా చేస్తుండేవారు. ప్లాంటులో కెమికల్స్‌తో శుద్ధిచేయడం, పంపింగ్ ద్వారా ఓవర్‌హెడ్‌ట్యాంకులకు పంపడం జరుగుతుంది. ఆత్మకూరు పట్టణ ప్రజలకు తాగునీరందించాలన్న సంకల్పంతో ఆనం రామనారాయణరెడ్డి పెద్ద ఎత్తున నిధులతో పథకాన్ని మంజూరు చేయించి శరవేగంగా నిర్మాణాలు పూర్తిచేయించగా పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వలన ప్రజలకు రెండురోజులకు ఒకరోజు మాత్రమే తాగునీటిని సరఫరాచేసి చేతులు దులుపుకుంటుండేవారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరు-ముంబాయి రహదారిపై ప్రభుత్వపాలిటెక్నిక్ కాలేజిలోనే ఓవర్‌హెడ్‌ట్యాంకు ఉన్నా వారికి నీటిసరఫరా కనెక్షన్ ఇవ్వక వారంతా తీవ్రంగా ఇబ్బంది పడుతుండేవారు. ఆసమాపంలోనే గురుకుల బాలికల పాఠశాల ఉండగా వారికి కూడా తాగునీటి కనెక్షన్ ఇవ్వలేదు. 12సంవత్సరాలుగా ఇంతపెద్ద బృహత్తర తాగునీటిపథకం ఉన్నా అందరికి రోజూ నిరివ్వని పరిస్థితి,



గురుకుల పాఠశాల, పాలిటెక్నిక్ కాలేజిలకు కనెక్షన్ ఇవ్వకపోవడం జరుగుతోంది, ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరుకు విచ్చేసినపుడు పాలిటెక్నిక్ కాలేజి పరిశీలించడం, ఇక్కడి తాగునీటి అవస్థలు గమనించడం జరిగింది. దాంతో అధికారుల సమీక్షాసమావేశంలో మంత్రి సీరియస్ అయ్యారు. ఇంతపెద్ద పథకం మంజూరు చేయించానని, ఎందుకు అందరికీ ప్రతిరోజూ నిరివ్వడంలేదని, గురుకులపాఠశాల, పాలిటెక్నిక్ కాలేజిలకు 12సంవత్సరాలుగా అడుగుతూనే ఉన్నా ఎందుకు కనెక్షన్లు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. కాగా మంత్రి మందలించిననాటినుండి పట్టణంలోని 80శాతంమందికి రోజూ తాగునీటిని సరఫరాచేస్తున్న అధికారులు మిగతా 20శాతంమందికి కూడా రోజూ నీరిచ్చేందుకు యత్నిస్తున్నారు. మొత్తంమీద రెండుదపాలు ఎన్నికైన పాలకవర్గాలు, ఇక్కడ పనిచేసిన కమీషనర్లు అత్యంత నిర్లక్ష్యం వహించారన్న విషయం వెల్లడైంది. త్వరలో సమస్య పరిష్కారం కానుందేమో చూడాల్సి ఉంది.

# రైతులను మోసం చేస్తున్న కొనుగోలు కేంద్రం సిబ్బంది

- కొనుగోలు కేంద్రం సిబ్బందితోపాటు అధికారులు కూడా పట్టించుకోని వైనం
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సరైన అవగాహన కల్పించడం లేదు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతులకు మద్దతు ధర కల్పించేందుకు ప్రతి పంచాయతీలో ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అయితే ఆ మద్దతు ధరకు అమ్ముకునేందుకు రైతులకు కొనుగోలు కేంద్రాల సిబ్బంది, అధికారులు సరైన అవగాహన కల్పించడం లేదని జలదంకి మండల బిజెపి అధ్యక్షులు ముడి కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మండల బిజెపి నాయకులతో కలసి స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు ముడి కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు తాము పండించిన వరి పంటకు మద్దతు ధరను ప్రకటించి ప్రతి పంచాయతీల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అయితే కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు కేంద్రాల సిబ్బంది, అధికారులు రైతులకు మద్దతు ధర గురించి సరైన అవగాహన కల్పించడం లేదని ఆయన తెలిపారు. దీంతో బైట్ మార్కెట్లో డీలర్లు తక్కువ ధరకు ధాన్యాన్ని సేకరిస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోల కేంద్రాల్లో రైతులకు గోతాలతోపాటు రవాణా చార్జీలు కూడా ఉచితంగా ప్రభుత్వం అందిస్తుందన్నారు. అయితే కొనుగోలు ఏ మిల్క్ ట్యాగ్ అయిందో లేదో సమాచారం కూడా ఇవ్వడం లేదన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ధరలతోపాటు ఏ మిల్లుకు ట్యాగ్ అయిందో కూడా ప్రకటించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికంగా సిబ్బంది, అధికారులు, పట్టించుకోకపోవడం మంచిది కాదని పేర్కొన్నారు. అధికారులు స్పందించి రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి మారేళ్ళ బ్రహ్మారెడ్డి, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు వద్దే శ్రీనాథ్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు బండారు తిరుపతిరెడ్డి, వంటేరు రాకేష్ రెడ్డి, అతిన చైతన్య యాదవ్, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించండి

**- అదనపు కమిషనర్ వైఓ నందన్**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర పాలక సంస్థ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ వాహనాల ద్వారా మాత్రమే వ్యర్థాలను సేకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో రోడ్లపై వ్యర్థాలు వేసే వారిని గుర్తించి జరిమానాలు విధించాలని అదనపు కమిషనర్ వైఓ నందన్ పారిశుద్ధ్య విభాగం వారిని ఆదేశించారు. పారిశుద్ధ్య విభాగం వారాంతపు సమీక్ష సమావేశాన్ని కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. విధుల నిర్వహణలో మేస్త్రీలు అందరూ తప్పనిసరిగా యూనిఫామ్ ధరించాలని, కార్మికులందరూ ఆప్రాన్‌లను ధరించాలని ఆదేశించారు. నిర్దేశించిన సమయానికి ప్రతి ఒక్కరూ తమ సచివాలయం పరిధిలో విధులలో హాజరుకావాలని సూచించారు. దోమలు లేని నగరంగా, డస్ట్ ఫ్రీ నగరంగా నెల్లూరును రూపొందించేందుకు ప్రతి ఒక్కరూ నిబద్ధతతో తమ విధులను నిర్వర్తించాలని సూచించారు. పారిశుద్ధ్య విభాగం, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులతో సమన్వయంగా ఉంటూ సచివాలయాల పరిధిలో పారిశుధ్య నిర్వహణ పనులను ప్రణాళిక బద్దంగా నిర్వహించాలని తెలియజేశారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేసే వారికి జరిమానాలను విధించి, వసూలు చేసిన ఆయా మొత్తాలను సంబంధిత కార్యాలయంలో నిర్దేశించిన సమయానికి జమ చేయాలని తెలిపారు. నిర్దేశించిన సమయానికి వార్డు సచివాలయ పరిధిలో మస్టర్ కేటాయించి విధులకు హాజరయ్యేలా సంబంధిత సెక్రటరీలు పర్యవేక్షించాలని సూచించారు. నగరవ్యాప్తంగా ఉన్న బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి ఆయా ప్రాంతాలను శుభ్రం చేసి తిరిగి అక్కడ వ్యర్థాలు వేయకుండా సంబంధిత కార్యదర్శులు బాధ్యత వహించాలని అదనపు కమిషనర్ ఆదేశించారు. నిషేధిత సింగల్ యూజ్డ్ ప్లాస్టిక్ ఉత్పత్తుల విక్రయం, రవాణా, నిల్వ తీవ్రమైన నేరాలుగా అవగాహన కల్పించి సచివాలయాల పరిధిలోని దుకాణాల నిర్వాహకులను హెచ్చరించాలని సూచించారు. అదేవిధంగా ఇంటింటి చెత్త సేకరణకు కార్పొరేషన్ కు పది కోట్ల రూపాయల ఖర్చు అవుతోందని, మేస్త్రీలు, కార్మికులంతా నిబద్ధతగా తమ విధులను నిర్వర్తించి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలని సూచించారు. అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానాలను విధించాలని, అదేవిధంగా ప్రతి సచివాలయ పరిధిలో జేసీబీ, ట్రాక్టర్ల సహాయంతో ఖాళీ స్థలాల యజమానుల ఖర్చుతో పారిశుద్ధ్య నిర్వహణ పనులను చేపట్టాలని తెలియజేశారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకింగ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, ప్రజలందరి చేత అభిప్రాయ సేకరణ జరిపించాలని అదనపు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, శానిటేషన్ సూపర్వైజర్లు, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్లు, మేస్త్రీలు, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్యతోపాటు మంచి అలవాట్లను నేర్పించాలి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థులకు విద్యతోపాటు మంచి అలవాట్లు, విలువలు నేర్పించాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. గురువారం మండలంలోని కొండాయపాళెం, వెంకట్రావుపల్లి ప్రాథమిక పాఠశాలలను సందర్శించారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు ప్రార్థనా సమయానికి వచ్చేటట్లు చూడాలన్నారు. వెన కబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోలీసు వ్యవస్థపై విద్యార్థులు అవగాహన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** విద్యార్థులు పోలీసు వ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థినీలకు పోలీస్టేషన్లో ఓపెన్హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ ఐఆర్ అంటే ఏమిటి, ఎలా నమోదు చేస్తారు. లాకప్ గది, ఆయుధాలు, బుల్లెట్లు, పోలీసుల పనితీరు తదితర వాటిపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏదైనా అత్యవసరమైతే డయల్ 100కు కాల్ చేయవచ్చన్నారు. పోలీసులు ఫ్రెండ్లీ పోలీసులుగా పని చేస్తున్నారన్నారు. అన్యాయం జరిగితే నిర్భయంగా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** జిల్లా పంచాయతీ అధికారి నెల్లూరు వారి ఆదేశాల మేరకు గురువారం కొడవలూరు మండలంలోని కొడవలూరు గ్రామపంచాయతీలో గల లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో ఎంపీడీవోలు, విస్తరణ అధికారి (పిఆర్ అండ్ ఆర్‌డి)లు అందరు పంచాయతీ కార్యదర్శులకు, గ్రీన్ అంబాసిడర్లకు, షెడ్డు మిత్రాలకు ఒక్కరోజు శిక్షణ ఇవ్వడం భాగంగా బుచ్చిరెడ్డిపాలెం మండలం వారికి ఈ శిక్షణ సాయంత్రం 5.00 గంటల వరకు ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి విద్యారమ, కొడవలూరు ఎంపీడీఓ సుబ్బారావు, బుచ్చిరెడ్డిపాలెం ఎంపీడీఓ శ్రీహరి, మండలవిస్తరణ అధికారి నారాయణరెడ్డి, నెల్లూరు డిపిఆర్సి నుంచి శ్రీనివాసులు, మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుండి పంచాయతీ కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్లు, షెడ్డు మిత్రాలు పాల్గొన్నారు.

## ప్రసన్న వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న బీద గోకుల్ దంపతులు



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కొండ బిట్రగుంట ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని బీద రవిచంద్ర తనయుడు బీద గోకుల్ దంపతులు గురువారం స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సత్య నారాయణ చార్యులు ఆలయ ఈఓ రాధాకృష్ణ వారికి ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల టీడీపీ అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, రావి విజయ్ కుమార్ యాదవ్, కోడూరు వెంకటేశ్వర్ రెడ్డి, ప్రసన్న కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 14న పిఠాపురానికి తరలి రండి

## జనసేన పార్టీ సీనియర్ నాయకుడు టోనీ బాబు పిలుపు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** జనసేన పార్టీ ఆవిర్భవించి 12 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈనెల 14వ తేదీన పిఠాపురంలోని చిత్రాడ ప్రాంతంలో జరిగే జనసేన సభకు లక్షలాదిమంది జనసేనకులు పాల్గొనాలని జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆంటోని పిలుపునిచ్చారు. గురువారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ పార్టీ పెట్టి మార్చి 14కు 12 సంవత్సరాలు అయినందున కార్యకర్తలు, అభిమానులు, అందరూ కలిసి పిఠాపురంకి జిల్లాకు 2000 మందికి పైగా పాల్గొని కార్యక్రమంను జయప్రదం చేస్తామని తెలిపారు. పవన్ కళ్యాణ్ గురించి జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన వ్యాఖ్యలు సబబుగా లేవని ఏదైనా ఉంటే అసెంబ్లీలో ఒక ఎమ్మెల్యేగా మాట్లాడితే తప్పు లేదని, తన సొంత ఛానల్ ఉంది కదా అని నోటికి వచ్చినట్లు మాటాడితే ప్రజలు ఊరు కోరాని హితవు పలికారు. జనసేన పార్టీ సీనియర్ నాయకులు రాము కాటూరి మాట్లాడుతూ.. తమ నాయకుడు పవన్‌కళ్యాణ్ గురించి మాట్లాడే హక్కు జగన్‌కు లేదని, మా నాయకుడు కార్పొరేటర్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకి తక్కువ, అని మాట్లాడావు జగన్ రెడ్డి నువ్వు సర్పంచ్‌కి ఎక్కువ కార్పొరేటర్‌కు తక్కువ అన్నారు. పవన్ కళ్యాణ్ గురించి మాట్లాడే అధికారం లేదు జగన్మోహన్ రెడ్డికి లేదని పేర్కొన్నారు.

# సీపీఎం ప్రజా చైతన్య యాత్రలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం మార్చి 8 నుండి 17 వరకు నెల్లూరు సిటీ నియోజకవర్గంలో సీపీఎం – ప్రజా చైతన్య యాత్రలు' చేపడుతున్నట్లు గురువారం ఉదయం బాలాజీ నగర్ డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. చిన్న చిన్న సమస్యలు కూడా పరిష్కారం కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా చైతన్యయాత్రలు చేపట్టామన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలను భాగస్వాములు చేసి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని సీపీఎం నెల్లూరు నగర కమిటీ ప్రకటించింది. ప్రచార ఆర్భాటాలతోనే పబ్బం గడుపుతూ కార్పొరేషన్ అధికారులు పన్నుల వసూళ్ల పేరుతో ప్రజలను బెదిరింపులు, వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. 'సూపర్ సిక్స్' నినాదానికే పరిమితం అయిపోయిందని, వివిధ సర్వేలు చేసి సంక్షేమ పథకాలలో కోత విధించే చర్యలు చేపడుతున్నారు అన్నారు. భారీ కాంట్రాక్టులు, లక్షల కోట్లు పై ఉన్న శ్రద్ధ సామాన్య ప్రజలపై ప్రభుత్వానికి లేకుండా పోయిందని అన్నారు. నెల్లూరు నగరంలో పెన్నానది ప్రవహిస్తున్నప్పటికీ మున్సిపల్ కొళాయిలలో ఒక్కచోట కూడా తాగేందుకు సురక్షితమైన నీరు సరఫరా కాకపోవడం సిగ్గుపడాల్సిన విషయమన్నారు. అనేక రోజుల నుండి మురుగునీరు ప్రవహిస్తున్న పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందని అన్నారు. విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కోసం ప్రజలందరినీ కదిలించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరించేందుకు ప్రజా చైతన్య యాత్రలు చేపడుతున్నామని తెలిపారు. సీపీఎం చేపడుతున్న ప్రజా చైతన్య యాత్రలలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వాములై జయప్రదం చేయాలని సీపీఎం నెల్లూరు నగర కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నెల్లూరు నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు, నెల్లూరు నగర కార్యదర్శి వర్గ సభ్యులు షేక్ మస్తాన్ బీపీ సూర్యనారాయణ నగర కమిటీ సభ్యులు బిపి నరసింహా మూలం ప్రసాద్, షేక్ రషీద్, కత్తి పద్మ, అత్తిమూరు శ్రీనివాసులు, షేక్ జాఫర్ పాల్గొన్నారు.

# పేదలకు చేయూతగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్

## పేదరిక నిర్మూలనే ధ్యేయం పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ : దొడ్ల మల్లికార్జున్



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** పేదలకు చేయూతగా, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దొడ్ల మల్లికార్జున్ తెలిపారు. గురువారం అమ్మా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని ముదివర్తిపాలెం పాఠశాల నందు పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కూటమి నాయకులు సిఘూకొల్లు నాగరాజు, కైలాసం శ్రీనివాసులు రెడ్డిలు విచ్చేసి విద్యార్థులకు పరీక్షకిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు దొడ్ల మల్లికార్జున్ మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి స్ఫూర్తితో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలో అన్ని పాఠశాలలకు కలిపి 418 కిట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలియజేశారు. 590 పైన మార్కులు సాధించిన విద్యార్థులకు 25వేల రూపాయలు నగదు బహుమతిగా అందిస్తామని తెలిపారు. అనగారిన వర్గాలకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం, అప్పాని శ్రీనివాసులు, రవి నాయుడు, ఇస్మాయిల్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఎస్‌బీఐ ఉచిత బ్యాంకు అకౌంట్స్



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** 11 ఏళ్ళు నిండిన విద్యార్థులకు పొదలకూరు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో ఉచితంగా సేవింగ్ ఖాతా ఓపెన్ చేసి, అకౌంట్ బుక్ మంజూరు చేస్తున్నట్లు బ్యాంక్ మేనేజర్ పీఎస్ రాజు, అకౌంటెంట్ జి.రవితేజ తెలిపారు. ఈ సేవింగ్ అకౌంట్ కోసం 11 ఏళ్ళు నిండిన విద్యార్థులు కేవలం ఆధార్ కార్డ్ జెరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, అప్లికేషన్ పూర్తి చేసి ఇస్తే అకౌంట్ ఓపెన్ వెంటనే అకౌంట్ బుక్ ఇస్తామని వెల్లడించారు. గురువారం పట్టణంలోని నాగార్జున ఇంగ్లీష్ మీడియం స్కూల్లోనే విద్యార్థులకు సేవింగ్స్ అకౌంట్ బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా అకౌంటెంట్ రవితేజ మాట్లాడుతూ.. 11 ఏళ్ల నుంచి సేవింగ్స్ అకౌంట్స్ ఉండడంవల్ల విద్యార్థుల్లో సేవింగ్స్ మీద అవగాహన ఉంటుందని, ఆర్థిక అక్షరాస్యతతో పాటు భవిష్యత్తులో ఎడ్యుకేషన్ లోన్ లాంటివి పొందే అవకాశం ఉంటుందన్నారు. కావున విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

## ఫ్రీ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను ప్రారంభం

▸ దువ్వూరు కళ్యాణ్ రెడ్డి



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గం ఇందుకూరుపేట మండలం గంగపట్నంలోని మీనాక్షి ఫ్రీ ప్రాసేసింగ్ ప్లాంట్‌ను టీడీపీ యువనాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. కూటమి నేతలు పొన్నబోయిన చెంచు కిషోర్ బాబు, గుడి హరికుమార్ రెడ్డి, డాక్టర్ అన్వేష్ గట్టులతో కలిసి ఫ్రీ ప్రాసెసింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలోఆయన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ప్లాంటును ప్రారంభించారు. అనంతరం ప్లాంట్ నిర్వాహకులు అశ్వక్, నాయబ్, ఖలీల్, సుధాకర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో దాసరి విజయ్ కుమార్, గుండాల మాధవరెడ్డి, బోద్దుకూరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళ్యాణ్ రెడ్డి మాట్లాడుతూ.. యువత ఇటువంటి యూనిట్ల ద్వారా ఉపాధి పొంది ఆర్థికంగా పురోగతి సాధించాలి. ఇటువంటి వారికి ఎప్పుడూ నా మద్దతు వుంటుంది. మిగతా వారు కూడా వారికి ప్రావీణ్యత వున్న రంగాలలో రాణించాలన్నారు.

## మహిళలకు విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన



**బోగోలు, మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం వారోత్సవాలలో భాగంగా గురువారం కావలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అదనపు సీడీపీఓ శారద ఆధ్వర్యంలో బోగోలు మండలం కోవూరుపల్లి గిరిజన కాలనీలో మహిళలకు విద్య యొక్క ఆవశ్యకతపై అవగాహన కలిగించారు. అనంతరం మహిళలకు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో బోగోలు మండల సూపర్వైజర్ కోటేశ్వరి, సుప్రజ అనూష ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం





**వెంకటచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం పూంజులూరుపాడు గ్రామంలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ పవిత్ర కార్యక్రమాన్ని ఆర్న మల్లికార్జున్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదమంత్ర ఘోషల మధ్య గణపతి హోమం, నవగ్రహ ప్రతిష్ట, ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి (తహసిల్దార్) శ్రీనివాస్, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సుబ్బారావు, ఎస్ఐ ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. భక్తులందరికీ తీర్థ ప్రసాదాలు అందించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. ఈ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు, అయ్యప్ప స్వామి కృపకు పాత్రులై, భక్తి భావంతో వేడుకలను సత్కరించారు. ఆలయ కమిటీ సభ్యుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతంగా పూర్తైంది.

# నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జలదంకి సుధాకర్

- నిర్ణయం తీసుకున్న రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి
- మొదటి నుంచి పార్టీ కోసం నిరంతరం కష్టపడిన జలదంకి
- టీడీపీ కార్యకర్తల్లో హర్షాతిరేకాలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా జలదంకి సుధాకర్ నియమితులు కాబోతున్నారు. గత కొద్ది రోజుల క్రితం నెల్లూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా అధ్యక్షుల సమన్వయ కమిటీ సమావేశంలో రాజకీయ పదవులకు సంబంధించి గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ని నెల్లూరు రూరల్‌కి కేటాయించడం జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌కు సంబంధించి నిర్ణయం తీసుకునే బాధ్యత కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి అప్పజెప్పటం జరిగింది. దీంతో నెల్లూరు రూరల్ లో పలువురు నాయకులు ఈ పదవి కోసం పోటీపడ్డారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవికి. ఈ యొక్క పరిస్థితుల్లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్ని ఆలోచనలు చేసి, అనేకమందితో చర్చించి, సుదీర్ఘ కాలంగా తెలుగుదేశం పార్టీకి అంకిత భావంతో సేవలు అందిస్తూ, అనేక సంవత్సరాలుగా తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్నటువంటి జలదంకి సుధాకర్‌ని ఈ పదవికి ఎంపిక చేస్తున్నట్టు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఈ మేరకు అతి త్వరలో ఉత్తర్వులు. వెలువడబోతున్నాయి. ఏది ఏమైనా జలదంకి సుధాకర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎంపిక కావటం నెల్లూరు రూరల్ నియోజకవర్గమే కాకుండా నెల్లూరు జిల్లాలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. మొదటినుంచి తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడుతున్న జలదంకి సుధాకర్‌కు పదవి దక్కడంతో పలువురు కార్యకర్తలు శభాష్ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కార్యకర్తకే పట్టాభిషేకం చేసిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అంటూ అభినందన వర్షం కురిపిస్తున్నారు.

# పవన్‌పై అనుచితవ్యాఖ్యలు సహించబోం



**ఆత్మకూరులో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న జనసేన నాయకులు, కార్యకర్తలు**

## జగన్ దిష్టిబొమ్మ దగ్ధం

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కొణిదెల పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సహించబోమని ఆత్మకూరు జనసేన నాయకులు పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా గురువారం వారు జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఆత్మకూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ సూచనలతో స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు స్థానిక బస్టాండు సెంటర్‌లో జగన్ దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌ను ప్రజలు తిరస్కరించినా ప్రతిపక్షహోదా అడుక్కోవడం మానేసి ప్రజల సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. కేవలం 11సీట్లు, ఒక్క రోజుకూడా అసెంబ్లీకి రాని జగన్‌కు ప్రతిపక్షహోదా ఎలా వస్తుందని వారు ప్రశ్నించారు. 10శాతం ఎమ్మెల్యే సీట్లు సాధించలేని జగన్మోహన్‌రెడ్డి ఓటమిని జీర్ణించుకోలేక మతి భ్రమించి మాట్లాడుతున్నారని వారు విమర్శించారు. ఏపదవి లేకుండా పదేళ్ళపాటు పవన్‌కళ్యాణ్ ప్రతిపక్షంలో ఉంటూ ప్రజలపక్షాన నిలిచారని వారు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచినా అసెంబ్లీకి జగన్ రావడం లేదని, అసూయతో సైకోలాగా మారారని, ఆయనకు వైద్యం అవసరమని వారు పేర్కొన్నారు. పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని, తగిన రీతిలో స్పందన ఉంటుందని వారు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సీనియర్ నాయకులు, ఉపాధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ఆర్‌లో టెక్నోపల్స్ 2కె25 కరపత్రిక ఆవిష్కరణ



**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మండలం కడనూతల రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం టెక్నో పల్స్ 2కె25 కరపత్రికలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. టెక్నోపల్స్ 2కె25 వల్ల సాంకేతిక విద్యలో విద్యార్థుల ప్రతిభను నైపుణ్యాలను వెలికి తీసే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేశ వ్యాప్తంగా సుమారు 100 కాలేజీలు పైగా పాల్గొనే అవకాశం, బ్రాంచ్ వైస్ బెస్ట్ ప్రైస్ కూడా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ఈనెల 22వ తేదీ జరుగుతుందని తెలియజేశారు. పూర్తి వివరాలకు రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల వెబ్సైట్ నందు చూడవచ్చని కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని కళాశాల ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో ఆర్వి రమణారెడ్డి, టెక్నో పల్స్ కన్వీనర్ డాక్టర్ దిలీప్ కుమార్ అన్ని విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** వెంకటాచలం మండలం సర్వేపల్లి ప్రాంతంలోని అంజ నేయ స్వామి గుడి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు వాహనాల మధ్య జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు యువకు లకు తీవ్ర గాయాలు కాగా, మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమి త్తం 108 అంబులెన్స్ ద్వారా నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 11 సీట్లకు ప్రతిపక్ష హోదా రాదు

### ఇది గుర్తుంచుకొని వైసీపీ అధ్యక్షుడు జగన్ మాట్లాడాలి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** రాష్ట్రం లోని ప్రజలు వైసీపీ ఐదేళ్ల పాలనపై విరక్తి ఇచ్చింది కూటమి ప్రభుత్వాన్ని అధికారులకి తీసుకొచ్చారని. దీనికి బాధ్యతగా వ్యవహరించి జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఎంతో ఖుషి చేసి కూటమి ప్రభుత్వాన్ని ఖుషి చేశారని పేర్కొన్నారు. వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అడగడం ఆశిస్యపదంగా ఉందన్నారు. 11 సీట్లకు పరిమితమైన వైసీపీ ఎలా ప్రతిపక్ష హోదా ఇస్తారంటూ తమ నేత పవన్ కళ్యాణ్ అసెంబ్లీ వేదిక అడగడం మంచి పరిణామం అన్నారు. ప్రజల్లో విలువలు విశ్వసనీయత కోల్పోయిన జగన్‌కు ప్రస్తుతం ప్రజలే బుద్ధి చెబుతున్నారు. గత ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రాన్ని దోచుకున్న జగన్ ప్రభుత్వానికి ప్రజలు మంచి బుద్ధి చెప్పిన జగన్ వ్యాఖ్యలు మాత్రం అత్యంత దారుణంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందర్నీ కలుపుకొని అందిస్తుంటే మంచి ప్రభుత్వం పాలన అందిస్తుంటే జగన్మోహన్‌రెడ్డి మాత్రం ఇలా నిసుగ్గుగా అసెంబ్లీ వేదికగా మాట్లాడు మసీదుకు మాట్లాడడం మంచిది కాదన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం బీజేపీ, జనసేన, టీడీపి కూటమి ప్రభుత్వం మరెన్నో అభివృద్ధి పనులు చేపడుతుందని ఆయన అన్నారు. 11 సీట్లకు పరిమితమైన వైసీపీ రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఉండదన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రాన్నిగా అరాచక పాలన సాగించారని ఆ విధి విధానాలతోనే ప్రజలతోనే ఆయననూ ప్రజలు తిరస్కరించారని పేర్కొన్నారు.

# పవన్‌ని చూడడానికి భయపడే జగన్ అసెంబ్లీకి వెళ్లట్లేదు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకిలో సీనియర్ జనసేన నాయకులు నిమ్మలపల్లి రామ చైతన్య డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తీవ్రంగా కండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ మీద మాట్లాడ్డానికి జగన్ కి ఈరోజు స్క్రిప్ట్ రాస్ ఇచ్చారని, ఆ పేపర్ తీసుకొని వచ్చి చదివి ఏదో చెప్పే ప్రయత్నం చేశారని, కానీ అతని మాటలు ప్రజలు పట్టించుకునే పరిస్థితిలో లేరని అన్నారు. జగన్ రెడ్డి విజ్ఞత కోల్పోయి మాజీ ముఖ్యమంత్రి అన్న సంగతి కూడా మర్చిపోయి పిచ్చి పట్టిన వ్యక్తిలా మాట్లాడుతున్నారని అన్నారు. జగన్ స్థాయి గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈరోజు పవన్ కళ్యాణ్ స్థాయి ఏంటి, జగన్ స్థాయి ఏంటో తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందన్నారు. గతంలో కూడా ఇలాగే అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమని ప్రగల్బాలు పలికిన వారందరూ ఈరోజు అసెంబ్లీ గేటు బయటకే పరిమితం అయ్యారని అన్నారు. పోటీ చేసిన అన్ని స్థానాల్లో గెలిచి దేశం చూపు మొత్తం జనసేన పార్టీ వైపు చూసేలా చేసిన ఘనత పవన్ కళ్యాణ్ గారిని అన్నారు. గతంలో 151 స్థానాల్లో గెలిచిన మీరు ఈరోజు అసెంబ్లీకి రావడానికి భయపడే పరిస్థితి ఉందని అన్నారు. తండ్రి అధికారం అడ్డం పెట్టుకొని దోచుకున్నది చాలక, తాము అధికారంలోకి వస్తే ఏ విధంగా దోచుకోవచ్చు అని చేసి చూపించిన వ్యక్తి జగన్ అని అన్నారు. ఈరోజు ఆయన మాట్లాడే మాటలన్నీ అస్తిత్వాన్ని కాపాడుకొనే ప్రయత్నమేనని అన్నారు. కాసేపు బెంగుళూరు ప్యాలెస్‌లో మరికాసేపు మరోచోట ఉండి గుర్తొచ్చినప్పుడు ప్రెస్ మీట్ పెట్టి ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్ష హెూదా ఇవ్వట్లేదని మొత్తుకుంటున్న జగన్ మోహన్ రెడ్డి ముందు రాజ్యాంగం గురించి తెలుసుకోవాలని అన్నారు. గతంలో 16వ లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడికి కావలసిన హెూదా గురించి అప్పటి ప్రతిపక్ష హెూదా కోరుకున్న కాంగ్రెస్ పార్టీ లీగల్ ఒపీనియన్ కోరగా అప్పటి అటార్నీ జనరల్ ముకుల్ రోహత్గి గారు 23-07-2014వ తేదీన రిపోర్ట్ ఇవ్వడం జరిగింది. అందులో చాలా స్పష్టంగా 1956లో మొట్టమొదటి స్పీకర్ పెద్దలు జీవి మల్వంకర్ గారు ఇచ్చిన 120, 121 డైరెక్షన్స్ ప్రకారం ప్రతిపక్ష నాయకుడు హెూదా కావాలంటే కనీసం 1/10 సీట్లు గెలవాల్సి ఉందని స్పష్టంగా తెలియజేశారు. జగన్మోహన్ రెడ్డి ముందు ఇవి చదువుకోవాలని, సలహాదారున్ని అడిగి ఇలాంటి రాజ్యాంగపరమైన ప్రతులను తెప్పించుకుంటే ప్రజాస్వామ్యం అంటే ఏంటో అర్థం అవుతుందని అన్నారు. అవేమీ తెలుసుకోకుండా పేపర్ రాసి ఇచ్చారు, వచ్చాము



చదివాము అధికారంలో ఉన్న నేతలను తిట్టాము అనే విధంగా జగన్ వైఖరి ఉందని అన్నారు. అలాగే జగన్ ఒక ఎమ్మెల్యే అని అతనికి అసెంబ్లీకి వెళ్లాల్సిన బాధ్యత ఉందని, అలాగే అతను వెళ్ళాక ఎమ్మెల్యేగా అతనికి ఇవ్వాల్సిన ప్రాధాన్యత అతనికి ఇస్తామని అన్నారు. అంతేగాని వెళ్ళకుండా నాకు టైం ఇవ్వరు అని చెప్పడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. జగన్మోహన్ రెడ్డి గారి అసెంబ్లీకి వెళ్లకపోవడానికి కారణం ప్రతిపక్ష హెూదా ఇవ్వకపోవడం కాదని, అక్కడికి వెళ్తే పవన్ కళ్యాణ్ గారు ఉంటారని, ఆయన చూస్తే కనీసం నోట్లో నుంచి మాట కూడా జగన్ కి రాదని, ఆయన చూసి మాట్లాడలేకనే జగన్ అసెంబ్లీకి వెళ్లట్లేదని అన్నారు. ఈరోజు కూడా ఆయన పేలిన పిచ్చి ప్రేలాపనలు పవన్ కళ్యాణ్ అంటే జగన్‌కి ఎంత భయం తెలియజేస్తున్నాయని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి లాగా మేము స్థాయి తగ్గించుకోమని, మా పార్టీ సిద్ధాంతాలతో నడిచిన పార్టీ అని అన్నారు. కనీసం సిద్ధాంతం కూడా లేని పార్టీ వైయస్ఆర్సీపీ అని, ఆ పార్టీ కూడా వేరొకరి దగ్గర నుంచి లాక్కున్న పార్టీ అని అన్నారు. అలాంటి వ్యక్తులు పవన్ కళ్యాణ్ గారు స్థాయి గురించి మాట్లాడటం వారి అజ్ఞానానికి నిదర్శనమని అన్నారు. అలాగే ఈ రాష్ట్రంలో జనసేన పార్టీ పెట్టింది రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అని, వారి అభివృద్ధి కోసమని, పవన్ కళ్యాణ్ నిరంతరం రాష్ట్ర ప్రజల సంక్షేమ కోసం ఆలోచిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఉదయగిరి నియోజకవర్గం సీనియర్ నాయకులు నిమ్మలపల్లి రామ చైతన్య, మండల ఇన్‌చార్జ్ తోట మురళి, జనసేన మండల ఉపాధ్యక్షులు తోటింపూడి రఘు, మండల కార్యదర్శి ఖాజా మస్తాన్, మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి

**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ఏఎస్ పేట ఎస్ఐ ఏ సైదులు పేర్కొన్నారు గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అలాగే కారు డ్రైవింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా సీటు బెల్టు పెట్టుకోవాలని పేర్కొన్నారు అలాగే ఆటో డ్రైవర్లు ఆటోలో అధిక లోడుతో వెళ్లకూడదని పేర్కొన్నారు అధిక స్పీడుతో వాహనాలు నడపకూడదని పేర్కొన్నారు. వాహనదారులు సరైన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని అలా లేనియెడల చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సైదులు తెలిపారు.

## అంగన్ వాడి కార్యకర్తలకు, తల్లులకు ఆటల పోటీలు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూరల్ నియోజకవర్గ పరిధిలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నెల్లూరు అర్బన్ పరిధిలోని కొండయపాలెం సెక్టరు నందు సీడీపీఓ లక్షిదేవి ఆదేశాల ప్రకారం సూపర్‌వైజర్ సుకన్య అధ్యక్ష తన జాతీయ మహిళాదినోత్సవ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా అంగన్ వాడి కార్యకర్తలకు, తల్లులకు ఆటల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా మహిళల్లో ఆటల ద్వారా మానసిక ఉత్సాహం జరుగుతుం దని అందరూ మహిళలు, బాలికల కోసం హక్కులు సమానత్వం సాధి కారతలో భాగంగా అందరికి ఆటల పోటీలు నిర్వహించి విజేతలను నిర్ణ యించడం జరిగింది. అదేవిధంగా కిషోరీ బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాల గురించి తెలియజేశారు. కార్య క్రమంలో సూపర్‌వైజర్ స్వరూప ప్రథమ కోఆర్డినేటర్ ఆషాక్ కుమారి కొండయపాలెం సెక్టర్ అంగన్‌వాడి టీచర్లు, తల్లులు పాల్గొన్నారు.

# చైతన్యం పెరిగితేనే మహిళాసాధికారిత సాధ్యం

▶ రిజర్వేషన్లకు సార్థకత ▶ రేపే అంతర్జాతీయ మహిళాదినోత్సవం




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** సమాజంలో మహిళలకు సముచిత స్థానం లభించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరాలన్నా, వారు పొందే అవకాశాలను సద్వినియోగపరుచుకోవాలన్నా, ప్రభుత్వం అమలు చేసే చట్టాలు, పథకాలు, రిసర్వేషన్లకు సార్థకతచేకూరాలన్నా మరింతగా చైతన్యవంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని సర్వత్రా అభిప్రాయపడుతున్నారు. గతంతో పోల్చుకుంటే కొంతమేరకు మహిళల్లో మార్పు కన్పిస్తున్నా ఇంకా రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మహిళాభివృది, మహిళాసంక్షేమం, మహిళాసాధికారత, మహిళాభ్యుదయం అంటూ పాలకులు, నాయకులు, వివిద ప్రజాసంఘాలవారు గొంతెత్తి అరుస్తుంటారు. కానీ పలుచోట్ల పరిశీలిస్తుంటే ఇంకా రిజర్వేషన్ మహిళాప్రజాప్రతినిధుల విధులను ఆయా ప్రాంతాల నాయకులు, వారి కుటుంబసభ్యులో నిర్వహిస్తుంటారు. వారిని ప్రోత్సహించడంతోపాటు వారికి అన్ని అంశాలపట్ల అవగాహన పెంపొందించి స్వయంగా విధులు నిర్వహింపజేసే పరిస్థితి సంపూర్ణంగా రావాల్సి ఉంది. ఎన్ని విదాలా మహిళలకు విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగ, స్థానికసంస్థల పాలనలో ప్రాధాన్యతనిస్తున్నా, ఎన్నో చట్టాలు చేస్తున్నా ఇంకా మహిళలపట్ల వేధింపులు, అత్యాచారాలు, హత్యలు పూర్తిగా ఆగడంలేదన్నది తెల్సిన విషయమే. మహిళలకు ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్న లక్ష్యంగా ప్రభుత్వం క్రాంతిపథకం, మెప్మా పథకాల ద్వారా పొదుపుసంఘాలు ఏర్పాటు చేసి తద్వారా స్త్రీశక్తి పెట్టుబడి నిధులు, బ్యాంకుల ద్వారా రుణాలు కల్పిస్తున్నారు. కోట్లాది రూపాయల వడ్డీలేని, స్వల్ప వడ్డీతో రుణాలు ఇస్తున్నా ఆశిస్తున్నరీతిలో ఉపాధిపొందుతున్నట్లు కానరావడం లేదు. స్థానిక సంస్థల పాలనలో మహిళలకు ప్రభుత్వాలు తొలుత 30శాతం, అనంతరం 50శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించగా మహిళలే ఆపదవులకు ఎన్నికవుతున్నారు. అయినా ఆశించినరీతిలో సంపూర్ణంగా స్వయం నిర్ణయాధికారంతో విధులు నిర్వహించడం లేదు. తగిన చైతన్యంతోనే మహిళాభ్యుదయం సాధ్యమని, ఆదిశగా ప్రభుత్వం యత్నిస్తున్న పరిస్థితి లేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగాల్లో 33శాతం రిజర్వేషన్ కల్పించగా అందులో మాత్రం మహిళలు సంపూర్ణంగా రాణిస్తున్నారు. వారి విధులు వారే నిర్వహిస్తుంటారు. స్థానిక సంస్థల పాలనలో మాత్రం అధికశాతం ఆయా మహిళల భర్తలు, కుటుంబసభ్యులు, ఆయా గ్రామాల నాయకులు వారి విధులను నిర్వమిస్తూ కన్పిస్తున్నారు. మహిళలు తగిన అవగాహనతో చైతన్యవంతులైతే వారి విధులు వారే స్వయంగా నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడగలదు. వారిలో సంపూర్ణ చైతన్యం రాకుంటే విద్య, ఉద్యోగ, పాలనలో ఎంతగా రిజర్వేషన్లు కల్పించినా, ప్రత్యేకంగా మహిళాబ్యాంకులు, పొదుపుసంఘాలు, మహిళా యూనివర్శిటీలు, మహిళా కాలేజిలు ఏర్పాటు చేసినా, మహిళా జన్మభూమి, మహిళారైతుసదస్సులు ఏర్పాటు చేసినా ఫలితం ఆశించిన మేరకు ఉండబోదన్నది అక్షరసత్యం. ప్రభుత్వం రిజర్వేషన్ పదవుల్లోనే కాకుండా నామినేషన్ పదవుల్లో కూడా మహిళలకు అధికంగా అవకాశం కల్పిస్తోంది. ఇది మంచి పరిణామం కాగా వారి విధులు వారే నిర్వహించుకునేలా వారిలో చైతన్యం తెచ్చేందుకు కూడా కృషి చేయాల్సి ఉంది. మహిళల పాలనాధికారాల్లో భర్తల,నాయకులు ప్రమేయం తగ్గించేలా పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది. మహిళా వేధింపులు, అత్యాచారాలు జరిగితే ప్రత్యేక చట్టాలున్నా, దిశలాంటివాటిని ప్రవేశపెట్టినా ఇంకా అనర్థాలు చోటుచేసుకుంటున్నాయంటే ఆచట్టాల ద్వారా చర్యలు తీసుకునే సమయంలో రాజకీయాలు జోక్యం లేకుండా ఉండాలి. పరిపాలనలో మహిళలకు ప్రాధాన్యత, భాగస్వామ్యం కల్పించాలన్న ప్రభుత్వాలు స్థానిక సంస్థల్లో అవకాశం కల్పించారు. చట్టసభల్లో కూడా మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాల్సి ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉద్యోగాల పరంగా మాత్రం ఉపాధ్యాయులుగా, ఇంజనీర్లుగా, న్యాయవాదులుగా, ఉద్యోగులుగా, న్యాయమూర్తులుగా, ఐఏఎస్, ఐపిఎస్‌లాంటి ఉద్యోగాల్లో సైతం మహిళలు పూర్తిగా స్వయంనిర్ణయాధికారంతో విధులు నిర్వహిస్తూ రాణిస్తున్నారు. విద్యలో కూడా బాలికలే అధికంగా ప్రతిభ చూపుతుంటారు. రిజర్వేషన్ ద్వారా సంక్రమించే పదవుల్లోని ఆత్మకూరు ప్రాంతంలో మహిళాప్రతినిధులను గమనిస్తుంటే ఇంకా వారిలో అవగాహన, స్వయంనిర్ణయాధికారం, తమ విధులు తామే నిర్వహించుకునే స్వేచ్ఛ రావాల్సిన అవసరం ఎంతైనా ఉందనిపిస్తోంది. సమావేశాల్లో చూస్తుంటే ఆ మహిళాప్రతినిధులకు బదులుగా వారి భర్త లేదా ఆయా గ్రామాల నాయకులు హాజరవుతుంటారు. ఈపరిస్థితి వలన రిజర్వేషన్లకు సార్థకతలేకుండా పోతోంది. ప్రతిఏటా మార్చి 8వతేదీన అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తుంటారు. అయితే ఆస్ఫూర్తితో మహిళాభ్యుదయానికి, మహిళాసాధికారితకు తగినట్లుగా వారిని మరింతగా చైతన్యపరిచి పాలనలో, ఆర్థికపరమైన నిర్వహణలో కూడా స్వయం ప్రతిపత్తితో వ్యవహరించేలా అందరూ తగినరీతిలో సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అపుడే మహిళా దినోత్సవానికి, మహిళల రిజర్వేషన్‌లకు సార్థకత చేకూరుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఈవిషయమై మహిళలకు అన్నిరంగాల్లో పురుషులు, చట్టాలు, ప్రభుత్వ నిర్ణయాలు సహకరించేలా అధికారయంత్రాంగం కూడా తమవంతుగా కృషిచేయాల్సిన అవసరం ఉంది. పురుషులు కూడా మహిళలు స్థానిక పాలనలో స్వయంనిర్ణయాధికారంతో వ్యవహరించేలా మార్పు తెచ్చుకోవాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ మహిళాదినోత్సవ స్ఫూర్తితో ఈదిశగా పయనం సాగుతుందేమో చూడాల్సి ఉంది.

హౌసింగ్ ఇండ్ల నిర్మాణంలో..

# అవినీతి తిమింగలాలకు షోకాస్ నోటీసులు

## చిన్న స్థాయి ఏఈలకు సస్పెన్షన్లు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** గృహ నిర్మాణ శాఖలో అవినీతి అధికారుల నిగ్గు తేల్చేందుకు ముందుగా ఎండీ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయా లని బిజెపి నమామి గంగ రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం పంపించారు. నెల్లూరు కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ ఉదయ్ కుమార్‌కు అవినీతిని వివరిస్తూ వినతిపత్రన్ని సమర్పించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులు కాంట్రాక్టర్లు కలిసి పేదల ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలిచ్చి కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారు. 2022 సంవత్సరంలో విజిలెన్స్ అధికారులు నెల్లూరులో కోటి 59 లక్షలు అవినీతి జరిగిందని నివేదికలు సమర్పిస్తే ఎండి కార్యాలయంలో గత పాలకుల ఒత్తిడికి విజిలెన్స్ నివేదికను ఐదు లక్షలుగా మార్పు చేశారు. నిజాయితీగా పనిచేసిన అధికారులను గత ప్రభుత్వం హయంలో ఎండి కార్యాలయంలో వేధించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా ఎండి కార్యాలయంలో అదే అధికారులను కొనసాగిస్తూ ఉండడంతో భారీ అవినీతి చేసిన అధికారులపై చర్యలు లేకుండా పోయాయి. ఒక గృహ నిర్మాణానికి బేస్ మెంట్‌కు 342 కేజీల స్టీల్ను వాడాల్సి ఉంటే దానిని రెండు గృహాల బేస్మెంట్లకు వినియోగించారు. నెల్లూరులో అప్పటి డీఈలు సచివాలయం ఎమినిటీస్‌లపై ఒత్తిడి చేసి ఇంటికి 200 కేజీలకు మాత్రమే ఇండెంట్ పెట్టించారు. మిగిలిన 142 కేజీల స్టీలుకు చెందిన ధనం ప్రభుత్వం వద్దనే ఉండాల్సి ఉండగా ఆ సొమ్మును కాంట్రాక్టర్ల అకౌంట్లకు బదిలీ చేసి కాంట్రాక్టర్లు అధికారులు పంచుకొని కేంద్ర ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం ఆదేశాలతో భౌతికంగా విచారణ జరిపిన విజిలెన్స్ అధికారులు 110కోట్ల రూపా యలు దుర్వినియోగం జరిగినట్లు నిర్ధారించారు. అయినా ఎవరిపై రికవరీ చర్యలు లేవు. వాస్తవానికి లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంది ఎండి కార్యాలయం నుండి ఆ విజిలెన్స్ అధికారులను అడ్డుకొని అవినీతిని తక్కువ చేసి చూపుతున్నారు. నెల్లూరు వెంకటేశ్వర పురం లేఔట్‌లో దాదాపు 912 ఇండ్లకు తలుపులు ద్వారా బందరాలు పెట్టకుండానే పెట్టినట్లు ఫైనల్ బిల్లులు కాంట్రాక్టర్కు చెల్లించి దోపిడీకి పాల్పడ్డారు. అలా పెద్ద ఎత్తున అవినీతి చేసిన అధికారులపై ఎండి కార్యాలయంలో ఎస్ఈలుగా ఉన్న అధికారులు చర్యలు తీసుకోకుండా కాపాడుతూ వచ్చారు. గత ప్రభుత్వంలో పనిచేసిన అధికారులని హౌసింగ్ శాఖలో యధాతథంగా కొనసాగిస్తూ ఉండడంతో అవినీతి పెద్ద అధికారులుకు షోకాజ్ నోటీసులతో సరిపెట్టడం. ప్రజల దృష్టి మరల్చేందుకు ఒకరిద్దరు ఏఈలపై సస్పెన్షన్ చేస్తున్నారు.

# ఏబీఎం ఆస్తులపై అసత్యప్రచారాలు చేస్తే చర్యలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలో గల ఏబీఎం ఆస్తులపై అసత్య ప్రచారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్టీబీసీ, పీఏబీసీ లా అధికారి కాకి శ్రీ నివాసులు పేర్కొన్నారు. గురువారం స్థానిక ఏబీఎం చర్చి ఆవరణలో పాస్టర్లు, సంఘ పెద్దలతో కలిసి విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మద్రాసు హైకోర్టు క్రిస్టియన్ ఆస్తులపై ఓ కమిటీ వేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఆ కమిటీ ఇంకా నియమింపడలేదన్నారు. కమిటీ నియమించిన తరువాత వారు ఆస్తులను పరిశీలించి కోర్టుకు నివేదిక ఇస్తుందన్నారు. అనంతరం కోర్టు తీర్పు ఇవ్వడం జరుగుతుందన్నారు. అయితే కొంతమంది గ్రూపులుగా ఏర్పడి ఈ ఆస్తులు తమవని, మేము అమ్ముతామని ఆనవ సరమైన ప్రసంగాలు చేయడం మంచిదికాదన్నారు. చట్టవ్యతిరేకంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు ఆనందరావు, జాషువా, ఆరోన్, కాకి ప్రసాద్, ఇమ్మానియేలు, పాస్టర్లు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నగరంలోని పార్కులకు పూర్వ వైభవం తీసుకొస్తాం : మంత్రి నారాయణ

**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరంలోని అన్ని పార్కులను ఆధునీకరించి పూర్వ వైభవం తీసుకొస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలియజేశారు. నగరంలోని ఐదవ డివిజన్ సత్యనారాయణపురంలోని ఎస్వీఆర్ పార్కు, 14వ డివిజన్ ఏసీ నగర్‌లోని మాగుంట సుబ్బారామిరెడ్డి పార్కులో ఏర్పాటుచేసిన జిమ్ ఎక్విప్మెంట్, క్రీడా సామాగ్రి, అభివృద్ధి పనులను అధికారులతో కలిసి మంత్రి నారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 2014-19 మధ్యలో తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అద్భుతంగా తీర్చిదిద్దామని, అనంతరం వచ్చిన ప్రభుత్వం పార్కులను పట్టించుకోకపోవడంతో క్రీడా సామాగ్రి, పరికరాలు పనికి రాకుండా మూలకు చేరాయని చెప్పారు. మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వ హయాంలో నగరంలోని అన్ని పార్కులను అప్గ్రేడ్ చేసి అత్యాధునిక వసతులతో చిన్నారులకు ఆనందం, ఆహ్లాదం పంచే విధంగా తయారు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పార్కుల్లో ఏర్పాటుచేసిన క్రీడా సామగ్రితో చిన్నారులు ఆనందంగా కేరింతలు కొడుతూ ఆడుకోవడం మనసుకు చాలా సంతోషంగా ఉందని మంత్రి చెప్పారు. జూన్ 12లోగా పాఠశాలలు ప్రారంభమయ్యే సమయానికి నగరంలోని అన్ని పార్కులను కూడా అత్యాధునిక సౌకర్యాలతో అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీల్లో గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పార్కులను అభివృద్ధి



చేసేందుకు ముఖ్యమంత్రి ఆదేశించారని, ఆ మేరకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి కోసం ఈ నెలాఖరులోగా 165 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేయనుందని, ఆ మేరకు పనులు ప్రారంభించేందుకు సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులతో కూడా మాట్లాడినట్టు చెప్పారు. ప్రజలకు అవసరమైన అన్ని పనులను పూర్తి చేస్తున్నట్లు మంత్రి చెప్పారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

నేటి దినపత్రిక సూర్య



విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని బుచ్చిరెడ్డిపాలెం, సంగం, కొడవలూరు, వెంకటాచలం,మనుబోలు, అల్లూరు, దగదర్తి, విడవలూరు దుత్తలూరు. నెల్లూరు పట్టణంలో దర్గామిట్ట, స్టోన్‌హౌస్‌పేట, వేదాయపాలెం, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను.

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం

మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సివిడి ఆఫీసు ఎదురుగా, కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9963827227

# నేడు కోవూరు ఎమ్మెల్యే పర్యటన వివరాలు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి నేడు (శుక్రవారం) కార్యక్రమ వివరాలు ఇలా ఉన్నాయి. సాయంత్రం 4:30 గంటలకు, బుచ్చిరెడ్డి పాలెం మండలం, బుచ్చి నగర పంచాయతీలోని, ఎస్‌బీఐ బ్యాంకు పక్కన గల ప్రాంగణం నందు, అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా, కోవూరు నియోజకవర్గ 'మహిళా విభాగం' ఆధ్వర్యంలో నిర్వహించుచున్న, 'ప్రీ-ఉమెన్స్ డే సెలబ్రేషన్స్' కార్యక్రమంలో పాల్గొంటారు. కోవూరు నియోజకవర్గ టీడీపీ, బిజెపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి కుటుంబ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కార్యాలయం కోవూరు ఓ ప్రకటనలో తెలియజేశారు.

# మెప్మా సిబ్బందికి చైర్ పర్సన్ సుప్రజ ప్రశంసలు

## హర్షం వ్యక్తం చేసిన కమిషనర్



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** మహిళలను పొదుపు ఉద్యమంలో భాగస్వాములను చేసి మహిళా సాధికారతకు కృషి చేస్తున్న మెప్మా సంస్థ కృషిని చైర్ పర్సన్ మోర్ల సుప్రజామురళి అభినందించారు. మెప్మా సంస్థ గిన్నిస్ బుక్ రికార్డు సాధించి అంతర్జాతీయ గుర్తింపు పొందిన నేపథ్యంలో బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతి కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. మెప్మా దక్కిన అరుదైన గుర్తింపు పట్ల చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళితోపాటు కమీషనర్ బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మోర్ల సుప్రజ మురళి మాట్లాడుతూ.. మహిళల జీవన ప్రమాణాలు మెరుగు పరచడంలో మెప్మా పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఈఓ నర్మద, బుచ్చి పట్టణ ఆర్‌పిఐలు పాల్గొన్నారు.